# ఉత్తరక్రౌండు

## యమ్.డి. అబ్దుల్లా

దీక్షగా వ్రాసుకుంటున్న ఉత్తరకుమారుడికి 'ఏమండోయ్'. అంటూ భార్య నాలుగవసారి అవహనంగా అరిచిన అరుపుతో ఉలిక్కి పడి తలెత్తి చూశాడు. భార్యవైపు 'ఏమిటే ఏ గోల' అన్నట్టుగా!

"అబ్బే. ఏమీలేదు ఏవో నాలుగు వాక్యాలు వ్రాసి పిచ్చిగీతలన్నీ గీస్తూ కాగితాలన్నీ అలా ఎందుకు చించి పారేస్తున్నారు."

"ఎందుకా! తిక్క రేగి వెధవ ప్రశ్నలు వేసి విసిగించక నీ పనేదో నువ్వు చూసుకో," అంటూ భార్యను కసిరికొట్టాడు.

పట్టువదలని విక్రమార్కుడిలా మళ్ళీ కాగితాల గుట్టమీదికి దండెత్తాడు. కాగితాలే పాడైపోతున్నాయి కానీ— ఏ కాగితము వ్రాతకు నోచుకోలేదు. విసుగెత్తి పెన్ను నేలకేసి కొట్టి తలపట్టుక్కూర్చున్నాడు.

అసలు జరిగిన విషయ మేమిటంటే— ఒక శుభ ముహూర్తాన మన ఉత్తరకుమారుడికి ఏ విధంగానైనా సరే, పేరు సంపాదించాలనే బుద్ధి పుట్టింది. వెంటనే రాజకీయ నాయకుడై పోవాలని ఆలోచన కలిగింది. కానీ— అదీ అంత తేలికైన విషయం కాదు. సినిమా యాక్టరైతే పేరూ, డబ్బు రెండూ సంపాదించవచ్చు అనుకున్నాడు. కానీ— నటనంటే ఏమిటో అసలే తెలియదు. రచయితగా మారితే చిక్కులేవి పని అనుకుని— వెంటనే కాగితాల గుట్ట ముందేసుక్కూర్చుని— అది అంత సులభమైందేమి కాదని త్వరలోనే తెల్సుకున్నాడు.

అన్యమనస్కంగా ఏదో పత్రిక తిరగేస్తున్న ఉత్తరకుమారుడికి ఉత్తరాల శీర్షిక కనిపించింది. వెంటనే ఉత్తరకుమారుడి మస్తిష్కంలో ఆలోచన తళుక్కున మెరిసింది. ఏదైనా పత్రికలో ఉత్తరాల శీర్షికకు ఉత్తరం వ్రాస్తే పేరు పత్రికలో పడుతుంది. ఆ విధంగానైనా పేరు సంపాదించవచ్చని వెంటనే కలం తీసుకొని పెట్టెలోంచి ఉత్తరం తీసి పత్రిక్కి వ్రాయడం మొదలెట్టాడు. ఎలా వ్రాయాలో అర్థం కాలేదు. మళ్ళీ ఓసారి పత్రిక తిరగేసి చూశాడు. ఉత్తరాల శీర్షికకోసం. ఉత్తరాల తీరుతెన్నులు ఏ విధంగా ఉన్నాయో పరిశీలిద్దామని.

7—7—77 నాటి పత్రిక అత్యద్భుతంగా ఉంది. మా అభిమాన నటి ఫణిశ్రీ. ముఖచిత్రం చూసి ఆనంద సముద్రంలో తేలిపోయాము. శ్రీధర్‌గారి 'వెయ్యిన్నొక్క విధాలు' కథ మా ఇంటిల్లిపాదిని ఆకర్షించింది. ఇంత మంచి కథలిందిస్తున్న మీ పత్రిక రేటు దయచేసి పెంచండి.

మాలాల రఘురాం
యాదగిరిగుట్ట.

ఇంకో ఉత్తరం చదివాడు.

ఆంధ్రుల అభిమాన నటి సూర్యశ్రీ ముఖచిత్రంతో వెలువడ మీ (మా) పత్రికను చూడగానే ఆనందంతో మూర్ఛపోయి ఓ గంట తర్వాత తేరుకున్నాను. ఇక కథల విషయాని కొస్తే సింహాద్రిగారి 'ఇది కథకాదు' ఈ వారానికే హైలైట్. ఇంతమంచి కథలందిస్తున్న మిమ్మల్ని అభినందించడానికి ఆ సృష్టికర్తకు కూడ అసాధ్యం.

రాజారావ్ (జగిత్యాల)

ఓహో! ఉత్తరాలు వ్రాయడం ఇలాగా అనుకొని వ్రాయడానికి పూనుకున్నాడు. ఎలాగో కష్టపడి ఉత్తరం వ్రాసి- ఒకసారి చదువుకుంటే తనకే నచ్చలేదు. పత్రికవాళ్ళకేం నచ్చుతుంది. వాళ్ళు ఈ ఉత్తరం చెత్తబుట్టలో వేసుకొంటా రనుకున్నాడు. ఈ ఉత్తరాలు వ్రాసే వాళ్ళు ఎలా వ్రాస్తారబ్బా! ముక్కుమీద వేలేసుకొని ఆలోచించినా అంతుపట్టలేదు. ఇందులో ఏదో టెక్నిక్ ఉంది లేకపోతే నే వ్రాసినా ఉత్తరం పనికిరాకపోవడమేమిటి? అనుకున్నాడు. బాగా ఆలోచించి, ఆరోజు మొత్తం కూర్చొని ఓ ఉత్తరం వ్రాసాడు. 'బ్రహ్మాండంగా ఉంది' అని తనే ఓమారు మెచ్చుకొని పత్రిక్కి పోస్ట్ చేశాడు.

మళ్ళీ ఆ పత్రిక మార్కెట్ లోకి రాగానే ఆశగాకొని ఉత్తరాల శీర్షికను ఆసక్తిగా క్రింద మీద అంతా వెతికాడు. ఊహూం తన ఉత్తరం లేదు. పరీక్ష ఫలితాలు చూసి తన నెంబరు కన్పించక పోతే ఆ విద్యార్థి ముఖం ఎలా వుంటుందో- ఉత్తరకుమారుడి ముఖం సరిగ్గా అలాగే అయింది.

ఆ తర్వాత ఇహ లాభం లేదనుకొని ఉత్తరకుమారుడు పత్రికలకు ఉత్తరాలు వ్రాయడం మానేయ్యదల్చుకున్నాడు.

ఓ వారం రోజుల తర్వాత ఉత్తరకుమారుడికి అర్జంట్ ప్రయాణం తగిలింది. తన ఫ్రెండ్ ఒకడు స్కూటర్ మీద యాదగిరిగుట్టకు వెళుతున్నాడు. క్రొత్తగా స్కూటర్ కొన్నాట్ట. దానికి పూజచేయించుకు రావడానికి. ఉత్తరకుమారుడ్ని ఆహ్వానిస్తే కాదనలేక బైలుదేరాడు. అక్కడికి వెళ్ళి నర్సింహస్వామి దర్శనం చేసుకున్న తర్వాత- ఉత్తరకుమారుడికి ఒక ఆలోచన మెదిలింది ఈ వూరినుంచి మాలాల రఘురాం పత్రికలకు ఉత్తరాలు వ్రాస్తాడు అతన్ని ఒకసారి కల్సుకొని ఉత్తరాలు వ్రాసే టెక్నిక్ తెల్సుకొంటే- ఎలావుంటుందనే ఆలోచనతో తన ఫ్రెండ్‌ను వెళ్ళిపొమ్మని పంపించేశాడు.

తనకు కావాల్సిన వాడి కోసం వాకబు చేసి త్వరలోనే అతని ఇల్లు పట్టగలిగాడు. ఒకరికొకరు పరిచయం చేసుకున్న తర్వాత- ఉత్తరకుమారుడు తన రాకకు కారణం చెప్పాడు.

"చాల సంతోషమండి! మీరు ఉత్తరాలు వ్రాయడంలో గల టెక్నిక్ తెల్సుకోవడానికి వచ్చినందుకు. నేను వివిధ పత్రికలకు వ్రాసిన ఉత్తరాలన్నీ ఒక సంకలనం చేసి ప్రచురించాను. అది కొని చదివితే మీకు తప్పకుండా ఆ టెక్నిక్ తెలుస్తుంది. ఉత్తరాలు ఎలా వ్రాయాలి, ఎలా వ్రాసే ప్రచురిత మౌతాయి వాటి గురించి వివరంగా వ్యాసాలు వ్రాశాను." అంటూ బీరువాలోంచి ఓపుస్తకం తెచ్చి టేబుల్ మీద పెట్టి—

"ఇదిగో! ఇదే పుస్తకం. దీని వెల కేవలం అయిదు రూపాయలు" అన్నాడు.

పట్టు వదలని విక్రమార్కుడిలా మళ్ళీ కాగితాల గుట్టమీదికి దండెత్తాడు. కాగితాలే పాడైపోతున్నాయి కానీ-ఏ కాగితమూ వ్రాతకు నోచుకోలేదు. విసుగెత్తి పెన్ను నేలకేసి కొట్టి తలపట్టుక్కూర్చున్నాడు.

ఉత్తరకుమారుడు వెంటనే జేబులోంచి అయిదు రూపాయలు తీసి రఘురాంగారి జేబులో కుక్కి ఆ పుస్తకాన్ని తన బ్యాగ్‌లో వేసుకున్నాడు. తర్వాత రఘురాంగారు ఎన్నో సలహాలు ఇచ్చారు.

"అన్నట్టు. మా ఉత్తరాలు వ్రాసే వాళ్లందరికి కల్పి ఒక ఎసోసియేషన్ ఉందండి. దానికి అధ్యక్షుడు రాజారావ్. ఆయన జగిత్యాలలో ఉంటారు. ఆయన దగ్గరికెళ్తే మిమ్మల్ని ఎసోసియేషన్‌లో సభ్యులుగా చేర్చుకోవడమే కాక— మరెన్నో సలహాలు ఇస్తారు. ఆయన నాకంటే అనుభవజ్ఞుడు.

వెంటనే ఉత్తరకుమారుడు వెనకాముందు ఆలోచించకుండా బస్సెక్కాడు. ఆ రోజే జగిత్యాలకు చేరుకోగలిగాడు. సులభంగానే రాజారావును కల్సుకోగలిగాడు. ఆయన ఉత్తరకుమారుడిని ఎంతో మర్యాదతో ఆహ్వానించారు. ఉత్తరాలు వ్రాయడంలో రాజారావుగారు కూడా చాల మంచి సలహాలు ఇచ్చారు. తమ ఎసోసియేషన్‌లో సభ్యులుగా చేర్చుకుంటూ ఈవిధంగా సెలవిచ్చారు.

"ఉత్తరకుమారా! మీరు ఇవాల్టినుండి మా ఎసోసియేషన్‌లో సభ్యులుగా చేరారు. కనుక మీరు పాటించాల్సిన నిబంధనలు మరికొన్ని ఉన్నాయి. ఆకాశవాణికి క్రమం తప్పకుండా ఉత్తరాలు వ్రాయాలి. ముఖ్యంగా హైదరాబాదు నుంచి ప్రసారమయ్యే 'చిత్తగించవలెను' 'శ్రోతలతో ముఖాముఖి' అనే కార్యక్రమం తప్పకుండా విని దానికి ఉత్తరాలు వ్రాయాలి. ఇంకా కార్మికుల కార్యక్రమంలో కూడా ఉత్తరాలు చదువుతారు. ఆ కార్యక్రమానికి కూడా ఉత్తరాలు వ్రాయాలి. ఇకపోతే వనితావాణి, రంగవల్లి, గ్రామీణుల స్త్రీల కార్యక్రమం, విజయవాడ కేంద్రం నుంచి ప్రసారమయ్యే 'ఉభయ కుశలోపరి' శ్రోతల ఉత్తరాల కార్యక్రమానికి ఉత్తరాలు వ్రాయాలి. స్త్రీల కార్యక్రమాలకు వ్రాసేటప్పుడు మాత్రం మీ ఆవిడ పేరు ముందెట్టి తర్వాత మీ పేరుతో ఉత్తరాలు వ్రాయాలి. అప్పుడే ప్రాధాన్యం ఉంటుంది.

ఇకపోతే 'యువవాణి' నుంచి ప్రసారమయ్యే 'వారం-వారం' శ్రోతల ఉత్తరాలకు జవాబుల కార్యక్రమం వినాలి. దానికి ఉత్తరాలు వ్రాయాలి. వివిధ భారతి నుంచి 'జనరంజని' మీరు కోరిన పాటలు అనే కార్యక్రమం ప్రసారమౌతుంది. దానికి మనకు కావల్సిన పాటలు వినిపించమని వ్రాస్తే— అసలు రావు. కనుక వాళ్లు ఎక్కువగా ఏ పాటలైతే వినిపిస్తారో ఆ పాటలే కోరాలి. అంటే వాళ్ళకిష్టమైన పాటలే కోరాలి కానీ మనకిష్టమైనవి కావు. వెధవ పాటలు ఎవడిక్కావాలి కానీ. మనక్కావల్సింది కేవలం రేడియోలో మన పేరు చదవడం. అంతే!

దాంతో పత్రికలు చదివే వాళ్ళకి, రేడియో వినేవాళ్ళకి మీ పేరు కంఠస్థం అయిపోతుందంటే నమ్మండి!" అని చెప్పి సిగరెట్ వెలిగించారు రఘురాంగారు.

ఉత్తరకుమారుడు ఊహాలోకంలో తేలిపోయాడు వెంటనే. "నాకో అనుమానమండి. రఘురాంగారు! పత్రికలకు ఉత్తరాలు వ్రాయాలంటే ప్రతి పత్రికా కొనాలి. రేడియోకు ఉత్తరాలు వ్రాయాలంటే ప్రతి కార్యక్రమం వినాలి. ఉత్తరాల ఖర్చే ఎక్కువంటే ఈ ఖర్చులన్నీ ఎవరు భరిస్తారండి."



దానికి వారు ఇల్లు అదిరిపోయ్యేట్టు నవ్వి ఇలా సెలవిచ్చారు. "చూడు ఉత్తరకుమారా! ప్రతి పత్రికా కొనాలంటే కష్టమే! కనుక మీ వూళ్ళో దివ్యంగా గ్రంథాలయం అంటూ ఒకటుందిగా. అక్కడికెళ్ళి మనం కథలు అవి చదవాల్సిన అవసరం లేదు. పత్రిక ఎవరి ముఖచిత్రంతో వెలువడింది. ఏఏ కథలున్నాయి. వాటి పేర్లూ, రచయితల పేర్లూ నోట్ చేసుకుంటే సరి! ఇహ ఉత్తరం మన వూహాచాతుర్యంతో దంచేయాలి. ఆకాశవాణి కార్యక్రమాల సంగతి అంటారా? అవి వినాలన్నా మహాబోర్! కనుక వినక్కర్లేదు. "వాణి" అనే పత్రిక మార్కెట్‌లోకి వస్తుంది. అది ఆకాశవాణి వాళ్లే ప్రచురిస్తారు. ఆ పత్రికలో ఒక నెలకు సరిపడ కార్యక్రమ వివరాలుంటాయి. ఏ నాటిక ఎప్పుడు, ఎన్నిగంటలకు, ఏ కేంద్రం నుండి ప్రసారమౌతుంది. నాటిక పేరు, రచయిత పేరు. ఏ మీటర్ బ్యాండ్‌లపై ప్రసారమౌతుందో అన్న వివరాలు ఉంటాయి. దాన్ని కొనేస్తే సరి. దాని వెలకూడా చాల తక్కువే. దాన్ని ఆధారంగా చేసుకొని చాలబాగా వ్రాసెయ్యొచ్చు ఉత్తరాలు. మా ఎసోసియేషన్ వాళ్ళు చాలమంది ఇలాగే వ్రాస్తుంటారు." అని సెలవిచ్చారు.

తనలో ఉన్న ఒక్క అనుమానం క్లియర్ అవడంతో ఉత్తరకుమారుడికి ముందు మార్గం కూడా క్లియర్‌గా కన్పించింది. ఆనక రాజారావ్ దగ్గర సెలవు తీసుకొని బైలుదేరాడు ఉత్తరకుమారుడు.

* * *

ఏ పత్రికలో ఉత్తరాల శీర్షిక చూసినా ఉత్తరకుమారుడి పేరే. చివరికి అరవాళ్ల పత్రికలో కూడా. ఆకాశవాణిలో ఏ కేంద్రం నుంచి శ్రోతల ఉత్తరాల కార్యక్రమం విన్నా ఉత్తరకుమారుడి పేరే మార్మోగిపోతోంది. దాంతో ఆ సంవత్సరం వాళ్ల ఎసోసియేషన్‌కు ప్రెసిడెంట్ తనే అయ్యాడు. ఎసోషియేషన్ వాళ్లు బ్రహ్మాండంగా సన్మానించి "ఉత్తమ ఉత్తర రచయిత" అని బిరుదు ఇచ్చేశారు.

ఇలా కొన్నాళ్ళు పోగాక అకస్మాత్తుగా ఉత్తరకుమారుడి పేరు ఏ పత్రికలోను, ఆకాశవాణిలోనూ వినిపించకుండా పోయింది. ఎసోసియేషన్ వాళ్ళు కంగారుపడిపోయారు కారణమేమిటో తెలియక.

అసలు జరిగిందేమంటే ఈ ఉత్తరాల పిచ్చి తన భర్తకు బాగా ముదిరి పోయిందని, జీతం రాళ్ళు కాస్తా ఉత్తరాలకు ఖర్చు చేసేస్తున్నాడని భార్య ఎంత చెప్పి చూసినా ప్రయోజనం లేకపోయింది. దాంతో ఉత్తరకుమారుడి భార్య పుట్టింటికి వెళ్ళిపోయింది. ఆ ఉత్తరాలు వ్రాయడం మానేస్తే సరే. సరి! లేదా విడాకులిచ్చేస్తానని బెదిరించిందట. దాంతో ఉత్తరకుమారుడు బెదిరిపోయి తన ఉత్తరకాండకు స్వస్తి చెప్పి భార్యను బుద్ధిగా కాపురానికి తీసుకొచ్చుకున్నాడు. ❋